# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

30-3-2025 ఆదివారం | పేజీలు-6 | హైదరాబాద్ | ekaburu.com









## భూకంప భయానకం మయన్మార్‌లో 1644కు పెరిగిన మృతులు

2లో

# పదేళ్ల పాటు కొడంగల్‌కు

## సీఎం సీటు – రేవంత్ రెడ్డి హామీ

- పదేళ్లలో కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా మారుస్తా
- భూములు కోల్పోయిన కుటుంబాలకు రెండు ఉద్యోగాలు, ఇంటి స్థలం
- బీజేపీ, బీసీలకు వ్యతిరేక పార్టీ – రేవంత్ విమర్శలు
- అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాపై ఆగ్రహం
- హిందూ, ముస్లింల ఐక్యత దేశ రక్షణకు అవసరం

2లో





### కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఇఫ్తార్ విందు

– ముస్లింలకు ప్రత్యేక శుభాకాంక్షలు

## సుక్మా జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్..

### 16 మంది మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.

2లో



## ప్రజాస్వామ్య ప్రక్రియపై కేంద్రం చిన్నచూపు : ప్రియాంక గాంధీ

**పార్లమెంటులో చర్చలను ఏలాగైనా నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ వ్యూహాలు పన్నుతోందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు.**



**ఈ-కబురు:** పార్లమెంటులో సరైన చర్చలు జరగకుండా భాజపా అడ్డుకుంటోందని కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా విమర్శించారు. చర్చలను ఏలాగైనా నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ వ్యూహాలు పన్నుతోందన్నారు. పార్లమెంటు బయట మీడియాతో మాట్లాడిన ప్రియాంక.. ప్రజాస్వామ్య ప్రక్రియను కేంద్రం చిన్నచూపు చూస్తోందని దుయ్యబట్టారు. "గత కొన్ని పార్లమెంటు సమావేశాలను గమనిస్తున్నా. ఏవిధంగానైనా చర్చలను అడ్డుకోవడమే వారి విధానంగా

తరువాయి 3లో

## హిమాచల్‌తో విద్యుత్ ఒప్పందం.. గొప్ప ముందడుగు: భట్టి విక్రమార్క

**తెలంగాణలో వేగంగా పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025' ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్ ప్రదేశ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.**



**ఈ-కబురు, హైదరాబాద్:** తెలంగాణలో వేగంగా పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025' ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్ ప్రదేశ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగని డిప్యూటీ సీఎం భట్టి

తరువాయి 2లో



## బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాపై కేసు నమోదు చేసిన సీఐడీ

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అక్కడి సీఐడీ కేసు నమోదు చేసింది. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నుతున్నారని అభియోగాలు మోపింది.

3లో

## తెలంగాణలో మార్చి 31న పనిచేయనున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

**తెలంగాణలో మార్చి 31న సెలవుగా ప్రకటించినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.**

**ఈ-కబురు,హైదరాబాద్:** తెలంగాణలో మార్చి 31న సెలవుగా ప్రకటించినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) అమల్లో భాగంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు

3లో



## ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ విచారణకు హాజరైన శ్రవణ్‌రావు

**ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్‌రావు సిట్ విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ ఎదుట ఆయన హాజరయ్యారు.**

**ఈ-కబురు,హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు శ్రవణ్‌రావు సిట్ విచారణకు హాజరయ్యారు. శనివారం తెల్లవారుజామున

2లో

## సభలో మాట్లాడటానికి సమయమిస్తే రాహుల్ వియత్నాంలో ఉన్నారు: అమిత్ షా

**సభలో మాట్లాడేందుకు తనకు సమయం ఇవ్వడం లేదంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు.**



**ఈ-కబురు:** లోక్‌సభలో తనకు మాట్లాడేందుకు సమయం ఇవ్వడం లేదని విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. సభలో మాట్లాడే సమయంలో ఆయన వియత్నాంలో ఉన్నారని వ్యాఖ్యానించారు. శుక్రవారం 'టైమ్స్ నౌ సమ్మిట్ 2025'లో షా పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు.

'సభలో మాట్లాడటానికి నియమాలు ఉన్నాయనే సంగతి బహుశా ప్రతిపక్ష నాయకుడికి తెలియకపోవచ్చు. సభలను ఇష్టానుసారం నడపలేము. బడ్జెట్‌పై చర్చల్లో మొత్తం సమయంలో 42 శాతం సమయం ఆయనకే ఇచ్చారు. పార్లమెంటులో చర్చ జరుగుతున్నప్పుడు ఆయన వియత్నాంలో ఉన్నారు. తిరిగి వచ్చి మాట్లాడతానని పట్టుబట్టారు. పార్లమెంటు అన్నది

2లో



## సన్నబియ్యం పంపిణీ.. తెలంగాణలోనే ప్రథమం

**దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ... చరిత్రలో నిలవబోతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.**

**84 శాతం మంది పేదలకు లబ్ధి**

**త్వరలో ఉప్పు, పప్పు, చింతపండు కూడా**

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ఈ-కబురు, హైదరాబాద్:** దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ... చరిత్రలో

తరువాయి 3లో



## మోదీ గ్రేట్ ప్రైమ్ మినిస్టర్.. ట్రంప్ ప్రశంసలు

భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు.

3లో

## తెలుగువారు ఉన్నంత వరకు తెదేపా ఉంటుంది: చంద్రబాబు

**ఒక మహనీయుడి విజన్ తెలుగు దేశం పార్టీ అని ఏపీ సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు.**

**ఈ-కబురు,అమరావతి:** ఒక మహనీయుడి విజన్ తెలుగు దేశం పార్టీ అని ఏపీ సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. ఆదర్శం కోసం పుట్టిన పార్టీ తమదని పేర్కొన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని చంద్రబాబు మాట్లాడారు.



"పార్టీ పెట్టి 9 నెలల్లో అధికారం దక్కించుకున్న ఏకైక పార్టీ తెదేపా. పేదల సంక్షేమానికి నాంది పలికిన మహానుభావుడు ఎన్టీఆర్. పార్టీకి మనమంతా వారసులం మాత్రమే.. పెత్తందారులం కాదు. నేను కూడా పార్టీకి అధ్యక్షుణ్ని.. టీమ్ లీడర్‌ను మాత్రమే. ప్రతి కార్యకర్తకు న్యాయం చేయాలి. తెలుగువారు ఉన్నంత వరకు పార్టీ ఉంటుంది. పార్టీని లేకుండా చేయాలని చాలా మంది ప్రయత్నించారు. అలాంటి వారు కాలగర్భంలో కలిసిపోయారు. తెదేపాను ఏమీ చేయలేకపోయారు. ముహూర్త బలం చాలా గొప్పది. పార్టీ సంకల్ప బలం కూడా

తరువాయి 2లో



## హిమాచల్‌తో విద్యుత్ ఒప్పందం.. గొప్ప ముందడుగు: భట్టి విక్రమార్క

**మొదటి పేజీ తరువాయి**

విక్రమార్క అన్నారు. విద్యుత్ భద్రతను పెంచుకునే అంశంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర భాగస్వామ్యంతో ఆర్థికంగా మేలైనది, స్వచ్ఛమైన విద్యుత్‌ను పొందేందుకు ఈ ఒప్పందం గొప్ప ముందడుగన్నారు. ఇవాళ హిమాచల్ రాజధాని శిమ్లాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు తో సమావేశమైన భట్టి.. విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నారు.

''థర్మల్ పవర్‌తో పోల్చినప్పుడు హైడల్ పవర్ ఉత్పత్తి (జల విద్యుత్) వ్యయం తక్కువగా ఉంటుంది. అంతేకాకుండా థర్మల్ పవర్ ఉత్పత్తి ఖర్చు ఏటా పెరుగుతూ ఉండగా.. హైడల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఎక్కువ జీవనదులు ఉన్న రాష్ట్రం కావడంతో సంవత్సరంలో 9 నుంచి 10 నెలల పాటు నిరంతర హైడల్ పవర్ (జల విద్యుత్) ఉత్పత్తికి అనువుగా ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ ప్రజలకు తక్కువ ధరకు, పర్యావరణ హితమైన విద్యుత్‌ను అందించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టులను తెలంగాణ జెన్‌కో నామినేషన్ విధానంలో చేపడుతుంది'' అని భట్టి తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ విచారణకు హాజరైన శ్రవణ్‌రావు

**మొదటి పేజీ తరువాయి**

దుబాయ్ నుంచి హైదరాబాద్ చేరుకున్న ఆయన.. విచారణ కోసం జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి వచ్చారు. విచారణకు సహకరించాలని శ్రవణ్‌రావును సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. ఆయన్ను అరెస్టు చేయొద్దని తెలిపింది. శ్రవణ్‌ను విచారిస్తే కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడిగా ఉండి.. అమెరికాలో తలదాచుకున్న మీడియా సంస్థ నిర్వాహకుడు అరువెల శ్రవణ్‌రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇటీవల నోటీసు జారీ చేసింది. ఈనెల 29న(శనివారం) తమ ఎదుట విచారణకు హాజరు కావాలని అందులో సూచించింది. నోటీస్ ప్రతిని ఈనెల 26నే హైదరాబాద్‌లోని ఆయన కుటుంబసభ్యులకు అందించింది. గతేడాది మార్చి 10న పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైన వెంటనే ఆయన తొలుత లండన్‌కు.. అక్కడి నుంచి అమెరికాకు వెళ్లిపోయారు. సిట్ విచారణకు రాకుండా అక్కడే ఉండిపోయారు. ఇటీవలే ఆయనపై రెడ్‌కార్నర్ నోటీస్ సైతం జారీ అయింది. తనకు ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ తెలంగాణ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఇటీవలే సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. దానిపై ఈనెల 24న జరిగిన విచారణలో అరెస్ట్ చేయకుండా ఆయనకు మధ్యంతర ఉపశమనం లభించింది. పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని షరతు విధించింది. అందుకు పిటిషనర్ న్యాయవాది అంగీకరిస్తూ.. అవసరమైతే ఆయన 48 గంటల్లోగా భారత్‌కు తిరిగి వస్తారని ధర్మాసనానికి హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలోనే 72 గంటల గడువు విధిస్తూ శనివారం తమ వద్దకు విచారణకు రావాలని సిట్ స్పష్టం చేసింది. దీంతో ధర్మాసనానికి హామీ ఇచ్చినట్లుగా శ్రవణ్‌రావు విచారణకు హాజరయ్యారు.

## సన్నబియ్యం పంపిణీ.. తెలంగాణలోనే ప్రథమం

**మొదటి పేజీ తరువాయి**

నిలవబోతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో దాదాపు 84 శాతం మంది పేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించబోతున్నామని చెప్పారు. ఉగాది రోజున ఆదివారం హుజూర్‌నగర్ వేదికగా ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి అర్హులందరికీ రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా మరో 30 లక్షల మందిని రేషన్‌కు అర్హులుగా గుర్తించబోతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఆయన హుజూర్‌నగర్‌లో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించి వచ్చి సచివాలయంలో సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. పేదలకు త్వరలో ఉప్పు, పప్పు, చింతపండు వంటి సరకుల్ని కూడా రేషన్‌దుకాణాల ద్వారా అందిస్తామని, క్రమక్రమంగా సరకుల సంఖ్య పెంచుతామని మంత్రి వెల్లడించారు. ''దొడ్డుబియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీ వల్ల రాష్ట్రంపై రూ.2,800 కోట్ల అదనపు భారం పడనుంది. ఆ భారాన్ని భరించాలని కేంద్రాన్ని కోరా. ప్రతి లబ్ధిదారుకు 6 కిలోల బియ్యం ఇస్తాం. తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు. అధికారుల వద్ద ఉన్న జాబితాలో పేరుంటే కార్డులేకపోయినా రేషన్ తీసుకోవచ్చు. నా సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఇంత మంచి సంక్షేమ పథకాన్ని చూడలేదు.

ప్రధాని ఫొటో గురించి ఇంకా నిర్ణయం తీసుకోలేదు

అందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నాం. బీపీఎల్ కుటుంబాల వారికి ఇచ్చేది మూడు రంగులతో, ఏపీఎల్ కుటుంబాలకు ఇచ్చేది ఆకుపచ్చ రంగుతో ఉంటుంది. వాటిపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. చిప్ ఉండదు. కొత్తవి ప్రింటింగ్‌కు ఇచ్చాం. రేషన్‌కార్డుపై ప్రధాని ఫొటో గురించి



ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కొత్తగా జారీచేసే వాటితో కలిపి రాష్ట్రంలో రేషన్‌కార్డుల సంఖ్య కోటికి, లబ్ధిదారులు 3.10 కోట్ల మంది అవుతారని అంచనా వేస్తున్నాం.

**భారాస నికరంగా ఇచ్చిన కార్డులు 49 వేలే**

సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన రూ.500 బోనస్‌తో కొనుగోలు చేసిన సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేయించి రేషన్ కార్డుదారులకు ఇవ్వబోతున్నాం. 2014 నాటికి రాష్ట్రంలో కార్డుల సంఖ్య 89,73,708. భారాస ప్రభుత్వం పదేళ్లకాలంలో తీసేసిన, ఇచ్చిన కార్డులను లెక్కేస్తే నికరంగా ఇచ్చినవి 49,479. కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు గత ప్రభుత్వ హయాంలో వచ్చిన దరఖాస్తులనూ మేం పరిష్కరిస్తున్నాం. సన్న బియ్యాన్ని రాష్ట్ర అవసరాలకే వాడతాం. ఎఫ్‌సీఐకి ఇవ్వం. దొడ్డు బియ్యం మాత్రమే ఇస్తాం'' అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, డైరెక్టర్ ప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ..రాహుల్ వియత్నాంలో ఉన్నారు

**మొదటి పేజీ తరువాయి**

వారి పార్టీలా కాకుండా, నిబంధనలకు అనుగుణంగా నడుస్తోంది. వారు సభా నియమాలు, నిబంధనలు పాటించాలి' అని షా పేర్కొన్నారు.

ఇక, దేశంలో ఎమర్జెన్సీ లాంటి పరిస్థితి నెలకొందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల గురించి రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు షా బదులిస్తూ.. నిజంగా ఎమర్జెన్సీ ఉంటే కాంగ్రెస్ నేతలు జైల్లో ఉండేవారన్నారు. కర్ణాటక ప్రభుత్వం కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం కోటా ప్రకటించడాన్ని షా తప్పుబట్టారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హస్తం పార్టీ మతం ప్రాతిపదికన కాంట్రాక్టులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఈసందర్భంగా తమిళనాడులో జరిగే ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందన్నారు.

# పదేళ్ల పాటు కొడంగల్‌కు సీఎం సీటు – రేవంత్ రెడ్డి హామీ

**రాష్ట్ర ముఖ్యమంత్రి కుర్చీ.. పదేళ్లపాటు కొడంగల్‌కే ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్లలో కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదుద్దుతానన్నారు.**



**ఈ-కబురు (కొడంగల్):**

రాష్ట్ర ముఖ్యమంత్రి కుర్చీ.. పదేళ్లపాటు కొడంగల్‌కే ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్లలో కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదుద్దుతానన్నారు. పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన వారి కుటుంబాలకు ఎకరాకు రూ.20 లక్షలు, 150 గజాల ఇంటిస్థలంతోపాటు కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వచ్చే ఐదేళ్లలో మరో రూ.10 వేల కోట్ల పనులు చేపడతామని చెప్పారు. శనివారం తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం పర్యటించారు. సాయంత్రం కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ముస్లింలకు సీఎం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి కొడంగల్‌లోని తన నివాసంలో నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశంలో రేవంత్ మాట్లాడారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంటు సాక్షిగా బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా, మహాత్మాగాంధీని చంపిన వారిని ప్రోత్సహించేలా మాట్లాడడం దారుణమన్నారు. వెనుకబడిన వర్గాలకు వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సమావేశాలు నిర్వహించి ఆయన స్ఫూర్తి చాటాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు.

**కొడంగల్ ప్రజలిచ్చిన శక్తితోనే..**

కొడంగల్ ప్రాంత ప్రజలు ఇచ్చిన శక్తితోనే తాను ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీకి వస్తే కొడంగల్ వ్యక్తిగా తాను మాట్లాడితే మాట పడాల్సి వస్తుందనే మాజీ సీఎం కేసీఆర్ సభకు రావడం లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ తరపున అసెంబ్లీకి వచ్చిన వారికి ఓనమాలు కూడా రావని అన్నారు. సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు ఉండాల్సిన అధికారం కొడంగల్‌కు రావడంతో కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. కొడంగల్‌ను ఎలాగైనా దెబ్బతీయాలనే లక్ష్యంతో రైతులను రెచ్చగొట్టి పరిశ్రమలను అడ్డుకునేందుకు చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఎం హోదాలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి తెలంగాణను కాపాడుకునే బాధ్యతను తాను తీసుకుంటానని, కొడంగల్ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలని అన్నారు. తనను లగచర్లకు వెళ్లాలంటూ అసెంబ్లీలో కేటీఆర్ విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, త్వరలోనే లగచర్లలో సమావేశం నిర్వహించి రైతులతో మాట్లాడతానన్నారు. కొడంగల్ ప్రాంతంలో ఎకరా భూమి ధర కోటి రూపాయల వరకు పెరగడమే తన ఆకాంక్ష అని ప్రకటించారు.

**వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం**

వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామిని శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సీఎంకు మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సీఎం మొదట శ్రీ భూవరాహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ప్రదక్షిణగా వెళ్లి ప్రభుత్వం తరఫున స్వామివారికి సమర్పించారు. అనంతరం యాగశాలలో ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆస్థాన మండపంలో వేద పండితులు, అర్చకులు తీర్థ ప్రసాదాలు, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తీసుకువచ్చిన స్వామి వారి శేషవస్త్రాలను సీఎం రేవంత్‌రెడ్డికి బహూకరించి ఆశీర్వదించారు. దేవాలయ ధర్మకర్తలు శ్రీవేంకటేశ్వరస్వామి ఫొటో, వస్త్రం, ప్రసాదాలను అందజేశారు.


**ఒక్క సంతకంతో అన్నీ కొడంగల్‌కు..**

''నేను ఉన్నంతవరకు కొడంగల్‌లో అభివృద్ధి పనుల కోసం మీరు ఎవరి వద్దకో వెళ్లి బిక్షం అడగాల్సిన పనిలేదు. ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయి. పనుల కోసం మీరు హైదరాబాద్‌కు రావాల్సిన పని లేదు. చిట్టీ రాసి పంపిస్తే 24 గంటల్లో నేనే వచ్చి కొడంగల్‌కు ఏ పనులు కావాలో అవన్నీ పూర్తి చేయిస్తాను'' ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన సందర్భంగా వారినుద్దేశించి సీఎం మాట్లాడారు. గత 15 ఏళ్లుగా మంచికి, చెడుకు ఇక్కడి ముస్లింలు తనకు అండగా ఉన్నారని తెలిపారు. కొడంగల్‌లో ముస్లింల అభివృద్ధికి ఎమ్మెల్యే అభివృద్ధి నిధుల నుంచి 25 శాతం కేటాయించామని గుర్తు చేశారు. దేశంలో ముస్లింలకు ఎక్కువ అవకాశాలు కల్పించింది కాంగ్రెస్సేనని తెలిపారు. మతోన్మాద పార్టీలకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో కాంగ్రెస్ ముందుంటుందన్నారు. హిందూ, ముస్లింలు ఏకమై దేశాన్ని రక్షించాలని భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఆ దిశగా తాము కృషి చేస్తూ ఉంటే, ఎన్నికల్లో గెలుపొందడానికి కొందరు మనలో మనకు విభేధాలు సృష్టించి లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలను సాగనివ్వబోమన్నారు.

## భూకంప భయానకం మయన్మార్‌లో 1644కు పెరిగిన మృతులు

**భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు అవసరం?**
**భూకంపం ప్రభావం: విధ్వంసకర దృశ్యాలు**
**ఆసుపత్రుల దుస్థితి: వైద్యం లేక అల్లర్లు**
**సహాయక చర్యలకు అడ్డంకులు**
**ప్రపంచ దేశాల సాయం**

**మయన్మార్‌లో భూకంపం కారణంగా మరణించిన వారి సంఖ్య 1644కు చేరింది.**



**ఇంటర్నెట్ డెస్క్:**

మయన్మార్‌లో సంభవించిన భూకంపం కారణంగా మరణించిన వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటివరకు 1644 మంది మృతి చెందినట్లు స్థానిక సైనిక ప్రభుత్వం ప్రకటించింది. మరో 3400 మంది గాయపడినట్లు తెలిపింది. భారీ సంఖ్యలో నివాస సముదాయాలు కూలిపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

భూకంపంతో కుదేలైన మయన్మార్‌కు సాయం చేసేందుకు భారత్ సహా అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. అయితే, రోడ్లు, వంతెనలు దెబ్బతినడం సహాయక సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లడం ఇబ్బందికరంగా మారుతోంది. మరోవైపు సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ శిథిలాల కింద మృతదేహాలు లభ్యమవుతూనే ఉన్నాయి. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలిస్తున్నప్పటికీ సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

## ..ఇఫ్తార్ విందు – ముస్లింలకు ప్రత్యేక శుభాకాంక్షలు

**రంజాన్ పండుగను పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొడంగల్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, ప్రజలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.**

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ మత సామరస్యానికి మారుప్రతిమ. ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది" అని అన్నారు. ముస్లిం సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని, విద్య, ఉపాధి, వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక మత పెద్దలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందులో సీఎం ప్రజలతో మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సీఎం మాట్లాడుతూ, "సమాజం ఐక్యంగా ఉండాలంటే మతసామరస్యమే మార్గం. అందరం కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములం కావాలి" అని ప్రజలను ఉద్దేశించి అన్నారు .ఈ వేడుక సాంస్కృతిక సమైక్యతకు, మతసామరస్యానికి ఒక ప్రతీకగా నిలిచింది.

## ..వరకు తెదేపా ఉంటుంది

**మొదటి పేజీ తరువాయి**

చాల గొప్పది. చరిత్రలో తెదేపా నాటి స్వర్ణ యుగం అని చెప్పుకొనే రోజులు శాశ్వతంగా వస్తాయి. 43 ఏళ్లు ఎన్నో సంక్షోభాలు వచ్చాయి.. అవకాశంగా తీసుకుని విజయాలు సాధిస్తున్నాం. పార్టీనే ప్రాణంగా బతికే పసుపు సైన్యానికి మనస్ఫూర్తిగా పాదాభివందనం చేస్తున్నా'' అని చంద్రబాబు అన్నారు.

**రెడ్ బుక్ పేరు వింటేనే కొందరికి గుండెపోటు...: లోకేశ్**

పార్టీలో సంస్కరణలపై తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో సంస్కరణలు తనతోనే మొదలు కావాలని ఆయన అన్నారు. మూడు సార్లు ఒకే పదవిలో ఉన్న వారు ఆ తర్వాతి స్థాయికి వెళ్లాలి లేదా బ్రేక్ తీసుకోవాలన్నారు. నాలుగు సార్లు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న తన నుంచే ఈ సంస్కరణ ప్రారంభించాలని ప్రతిపాదిస్తున్నానన్నారు. గ్రామస్థాయి నాయకులు రాష్ట్ర నేతలుగా ఎదిగి పొలిట్ బ్యూరోలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. యువతకు రెక్కలు వచ్చి రాజకీయాల్లోకి రావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. సీనియర్లు, జూనియర్లకు సమ ప్రాధాన్యం ఇస్తామన్న ఆయన.. పని చేసే వారికి మాత్రమే ప్రమోషన్లు ఉంటాయని వెల్లడించారు. పార్టీలో యువరక్తం నింపేందుకు ప్రతి ఒక్కరి సహకారం కావాలని కోరారు. తాను ఎక్కడ మాట్లాడుతున్నా రెడ్ బుక్ ప్రస్తావన వస్తోందన్న ఆయన.. రెడ్ బుక్ పేరు వింటేనే కొందరికి గుండెపోటు వస్తోంది, ఇంకొందరు బాత్రూమ్‌ల్లో జారిపడతున్నారని విమర్శించారు. ఇగోలు, అధికార గర్వం పక్కన పెట్టి అంతా కలసికట్టుగా పనిచేద్దామని లోకేశ్ పిలుపునిచ్చారు.

## సుక్మా జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్.. 16 మంది మావోయిస్టుల మృతి

**ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.**



**ఈ-కబురు,సుక్మా:**

దండకారణ్యంలో శనివారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. స్థానిక గోగుండా కొండపై మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈక్రమంలో మావోయిస్టులు కాల్పులకు దిగారు. ఎదురుకాల్పులు జరిపిన పోలీసులు 16 మందిని హతమార్చారు. ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి. కెర్లపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కాల్పులు చోటుచేసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్ , సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. గాయపడిన సిబ్బంది డీఆర్‌జీ విభాగానికి చెందిన వారిగా పేర్కొన్నారు.

**భారీగా ఆయుధాలు స్వాధీనం**

సంఘటనా స్థలం నుంచి 16 మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ మీడియాకు తెలిపారు. పెద్ద సంఖ్యలో ఏకే47 రైఫిల్స్‌తోపాటు, సెల్ఫ్ లోడింగ్ రైఫిల్ (ఎస్ఎల్ఆర్), ఇన్సాస్, రాకెట్ లాంచర్, బరెల్ గ్రనేడ్ లాంచర్ (బీజీఎల్)లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు.

**మావోయిస్టుల దుశ్చర్య.. ఐఈడీ పేలి ఇద్దరు చిన్నారుల మృతి**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. వారు అమర్చిన ఐఈడీ పేలిన ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందగా.. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు బీజాపూర్ పోలీసులు వెల్లడించారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లే మార్గంలో మావోయిస్టులు గతంలో ఐఈడీ అమర్చారు. అడవిలో పండ్లు ఏరుకునేందుకు తన పిల్లలతో కలిసి వెళ్లిన మహిళ తిరిగి ఇంటికి వస్తుండగా.. అనుకోకుండా దానిపై కాలు వేయడంతో ఒక్కసారిగా అది పేలిపోయింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా.. ఇద్దరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు ఆమెను దగ్గర్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.



## బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాపై
# కేసు నమోదు చేసిన సీఐడీ

**బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అక్కడి సీఐడీ కేసు నమోదు చేసింది. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నుతున్నారని అభియోగాలు మోపింది.**

**ఈ-కబురు,ఢాకా:**
దేశం విడిచి పారిపోయిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కుట్ర పన్నుతున్నారనే అభియోగంపై హసీనాతో పాటు మరో 72 మందిపై కేసులు నమోదైనట్లు అక్కడి ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ‘‘ కుట్ర వ్యవహారంలో షేక్ హసీనాపై ఢాకా మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు నమోదైంది. కోర్టు ఆదేశాల మేరకు దీనిపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) విచారణ ప్రారంభించింది.’’ అని పోలీసు ఉన్నతాధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు.

గతేడాది డిసెంబర్ 19న షేక్‌హసీనా ఆన్‌లైన్‌లో సమావేశాన్ని ఏర్పాటుచేసినట్లు సీఐడీకి స్పష్టమైన సమాచారం ఉంది. ‘‘ జాయ్ బంగ్లా బ్రిగేడ్’’ పేరుతో వ్యవస్థను ఏర్పాటుచేసి.. తద్వారా బంగ్లాలో మళ్లీ హసీనా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలన్నది ఆ సమావేశం ముఖ్య ఉద్దేశం. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు హసీనా కుట్ర పన్నుతున్నారంటూ సీఐడీ ఆమెపై కేసు నమోదు చేసింది. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో గతేడాది ఆగస్టు 5న దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో హసీనాతోపాటు ఆమె మంత్రివర్గంలో ఉన్న నేతలు, సలహాదారులు, సైనికాధికారుల పైనా నేరారోపణలు నమోదయ్యాయి. ఈక్రమంలో ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ICT) ఇప్పటికే ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది.



## మోదీ గ్రేట్ ప్రైమ్ మినిస్టర్..
# ట్రంప్ ప్రశంసలు

**భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు.**

**ఈ-కబురు:** భారత ప్రధాని నరేంద్ర మోదీ ని ఉద్దేశిస్తూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన చాలా తెలివైన వ్యక్తి అని, తనకు మంచి స్నేహితుడని పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ‘మోదీ ఇటీవలే అమెరికాలో పర్యటించారు. ఆయన చాలా తెలివైన వ్యక్తి. మేమిద్దరం మంచి స్నేహితులం. మా మధ్య మంచి చర్చలు జరిగాయి. అవి ఇరుదేశాలకు ఉపయోగకరమైనవిగా భావిస్తున్నా.

మీకు (భారత ప్రజలను ఉద్దేశిస్తూ..) గొప్ప ప్రధాని ఉన్నారు. ఆ దేశంతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. కానీ, ఆ దేశంతో నాకున్న ఏకైక సమస్య సుంకాలు . ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్‌లు విధించే దేశాలలో ఇండియా ఒకటి. వారు బహుశా వాటిని గణనీయంగా తగ్గించబోతున్నారని నమ్ముతున్నా. అయితే ఏప్రిల్ 2న వారు మన దిగుమతులపై ఎంత సుంకాలు వసూలుచేస్తే .. నేను వారి నుంచి అంతే వసూలు చేస్తా’అని ట్రంప్ పేర్కొన్నారు.

ఇటీవల మోదీ యూఎస్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. సుంకాలు, వలసలు, ఇరుదేశాల వ్యూహాత్మక అంశాలపై ప్రధానంగా ఇరువురు నేతలు చర్చలు జరిపారు. ఈసందర్భంగా టారిఫ్‌ల విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని మోదీతో స్వయంగా చెప్పినట్లు ట్రంప్ తెలిపారు. ఈసందర్భంగా ఇరు దేశాలకు ఉపయోగకరంగా ఉండేలా.. వాణిజ్య ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు .

భారత్‌యూఎస్ ట్రేడ్ అండ్ టారిఫ్ చర్చల్లో భారత్ దృఢవైఖరిని ప్రదర్శించింది. కొన్ని వస్తువులపై టారిఫ్ కోతలకు అంగీకరించినప్పటికీ.. దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తోంది. సుంకాలు తగ్గించినంత మాత్రాన అమెరికా ఒత్తిడికి లొంగిపోయినట్లు కాదని కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారి ఇటీవల మీడియాతో పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తులైన వాల్‌నట్స్, యాపిల్, బాదం వంటి వాటిపై తగ్గింపునకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అయితే, భారత్‌లో వ్యవసాయరంగ పరిస్థితులను దృష్టిలోఉంచుకొని గోధుమ, మొక్కజొన్న వంటివాటిపై రాయితీకి అవకాశం లేదన్నారు.

## తెలంగాణలో మార్చి 31న పనిచేయనున్న
# సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

**మొదటి పేజీ తరువాయి**
కల్పించింది. ఎల్ఆర్ఎస్ ఫీజులోనూ 25% రాయితీ ఇవ్వనుంది. పైగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులోనే నేరుగా క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించింది. మార్చి 31లోగా ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని వెల్లడించింది.

కాగా, 30, 31 సెలవు దినాలు కావడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపునకు 31న కూడా అవకాశం కల్పించాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు రావడంతో ప్రభుత్వం స్పందించింది. 31న బ్యాంకులు కూడా పనిచేయనున్న నేపథ్యంలో ఆ రోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని ప్రభుత్వం వెల్లడించింది. ఎల్ఆర్ఎస్ కోసం 25,67,107 మంది దరఖాస్తు చేసుకోగా.. మార్చి 28 వరకు 3,25,538 మంది ఫీజు చెల్లించినట్లు పురపాలక పేర్కొంది. ఈ క్రమంలోనే తాజాగా మరో 20,00,493 మందికి ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించాలని పురపాలక శాఖ లేఖలు రాసింది.

## నాది పూర్తయిన ఇళ్లకు
# తక్షణమే చెల్లింపులు

**పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పునాది వరకు పూర్తయిన ఇళ్లకు వెంటనే చెల్లింపులు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.**

**జూన్ ఆఖరుకు వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పూర్తి**
**గ్రామాల్లో తాగునీటి సమస్యలు రావద్దు**
**ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి**



**వరంగల్ జిల్లా సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే రామచంద్రునాయక్, మంత్రులు సీతక్క, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి**

**ఈ-కబురు, హైదరాబాద్:**
పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పునాది వరకు పూర్తయిన ఇళ్లకు వెంటనే చెల్లింపులు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ... ‘‘రాష్ట్ర ప్రభుత్వానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అత్యంత ప్రాధాన్యాంశం. దీన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాల కలెక్టర్లు పనిచేయాలి. పునాది స్థాయికి చేరిన ఇళ్ల వివరాలను గృహనిర్మాణ శాఖకు పంపిస్తే తక్షణమే రూ.లక్ష చెల్లిస్తాం. ఇందిరమ్మ ఇళ్లకు అర్హత కలిగిన లబ్ధిదారుల్లో స్థలాలు లేని వారికి... ఖాళీగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను కేటాయించాలి. మొండి గోడలతో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి గుత్తేదారు ముందుకురాకుంటే లబ్ధిదారులే పూర్తి చేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. రానున్న మూడు నెలలు చాలా కీలకం. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్లు అప్రమత్తం కావాలి. అధికారులతో సమన్వయం చేసుకొని వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలి. నీటికొరత ఉంటే ట్యాంకర్లతో సరఫరా చేయాలి. చెడిపోయిన బోర్లు, చేతిపంపులను తక్షణమే మరమ్మతు చేయించాలి.

### ఉత్తర తెలంగాణకు అత్యాధునిక వైద్యం

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని రెండు నెలల్లో పూర్తి చేసి, జూన్ చివరినాటికి అన్ని వసతులు కల్పించాలి. ఇక్కడ సేవలు ప్రారంభమైతే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వస్తుంది. మడికొండలో డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపాలి. తర్వాత పురపాలక శాఖ కమిషనర్-డైరెక్టర్ శ్రీదేవి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డుకు 150-200 ఎకరాల వరకు భూసేకరణ చేయాలి. వరంగల్ భద్రకాళి చెరువు పూడికతీతను వర్షా కాలంలోపు పూర్తి చేయాలి. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. సమావేశంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయని రాజేందర్, యశస్వినీరెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్రునాయక్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్రో ప్రయాణ వేళల్లో మార్పులు..
# ఆ ఆఫర్ మరో ఏడాది పొడిగింపు

**మెట్రో ప్రయాణ వేళల్లో మార్పులు చేసినట్లు హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.**



**ఈ-కబురు, హైదరాబాద్:**
మెట్రో ప్రయాణ వేళల్లో మార్పులు చేసినట్లు హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం రాత్రి 11 గంటల వరకే నడుస్తున్న మెట్రోరైళ్లు.. ఏప్రిల్ 1 నుంచి రాత్రి 11:45 గంటల వరకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అంటే టెర్మినల్ స్టేషన్ నుంచి చివరి రైలు ఇకపై రాత్రి 11.45 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే ఈ మారిన వేళలు అమల్లో ఉంటాయని చెప్పారు. టెర్మినల్ స్టేషన్‌ల నుంచి ఆదివారం మొదటి రైలు ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

**సూపర్ సేవర్ హాలిడే ఆఫర్.. ఏడాది పొడిగింపు**
ఏప్రిల్ 2024లో ప్రారంభమైన సూపర్ సేవర్ హాలిడే ఆఫర్ (SSO), ఆఫ్‌పీక్ వేళల్లో స్మార్ట్ కార్డులపై ఇచ్చే తగ్గింపు మార్చి 31తో ముగియనుంది. ఈ ఆఫర్‌తో 20 ట్రిప్పులకు డబ్బులు చెల్లించి 30 ట్రిప్పులు ప్రయాణించేలా అవకాశం కల్పించారు. తాజాగా ఈ ఆఫర్‌ను మరో ఏడాది పొడిగిస్తూ హైదరాబాద్ మెట్రో నిర్ణయం తీసుకుంది. 2026 మార్చి 31 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని సంస్థ పేర్కొంది.



## ..కేంద్రం చిన్నచూపు : ప్రియాంక గాంధీ

**మొదటి పేజీ తరువాయి**
కనిపిస్తోంది. ఏదైనా అంశంపై విపక్షాలు నిరసనలు చేయబోయే సమయంలో వారిని రెచ్చగొట్టడం, విపక్ష నేతను మాట్లాడకుండా అడ్డుకోవడం కొనసాగుతోంది’’ అని ప్రియాంకా గాంధీ వాద్రా పేర్కొన్నారు. ఎంపీల సాక్షిగా.. పార్లమెంటు కార్యకలాపాలను ప్రజాస్వామ్య ప్రక్రియలో కొనసాగించకుండా కేంద్రం అడ్డుకోవడం విచారకరమన్నారు.

# సరిహద్దు అవతలి కుట్రలు..
## పిల్లల ప్రాణాలు తీస్తున్నాయి: జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం

**హింసతో దక్కేదేమీ లేదని గుర్తించి..పాకిస్థాన్ ఇప్పటికైనా ఉగ్రవాదాన్ని వదులుకోవాలని జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ చౌధరీ హితవు పలికారు.**

**ఈ-కబురు:** సరిహద్దు అవతల పన్నుతున్న కుట్రల వల్ల తమ పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ చౌధరీ ఆవేదన వ్యక్తం చేశారు. హింసతో ఏమీ సాధించలేమనే విషయాన్ని తెలుసుకొని పాకిస్థాన్ ఇప్పటికైనా ఉగ్రవాదాన్ని వదులుకోవాలని హితవు పలికారు. మూడు దశాబ్దాలుగా అక్కడ ఉన్న ఉగ్రవాదం అంతమై..మంచి పరిస్థితులు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

కేంద్ర, ప్రభుత్వం కానీ, జమ్మూకశ్మీర్ ప్రభుత్వం కానీ మన పిల్లల బలిదానాలను ఎప్పటికీ కోరుకోవు. సరిహద్దు అవతల పన్నుతున్న కుట్రల కారణంగానే వారు ప్రాణాలు కోల్పోతున్నారు. గత 30ఏళ్లుగా మనపై దాడులు చేస్తున్నా వారు ఏమీ సాధించలేదని.. ఉగ్రచర్యలకు భారత్ లొంగదని పాకిస్థాన్ గుర్తుపెట్టుకోవాలి. ఆ దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం వల్ల తనకు తానుగా ప్రమాదాన్ని తెచ్చిపెట్టుకుంటోంది’’ అని సురీందర్ చౌధరీ అన్నారు.



కథువా జిల్లాలోని సఫియాన్ అడవిలో ఉగ్రవాదులతో రెండు రోజుల పాటు జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రసంస్థ జైష్‌ఎమొహమ్మద్ (జెఎం)తో సంబంధం ఉన్న ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు హతమార్చాయి. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా, ఒక డీఎస్పీతో పాటు నలుగురు సైనికులు గాయపడ్డారు. ఈ ఆపరేషన్ ఇప్పటికీ కొనసాగుతోంది. మృతిచెందిన పోలీసులకు నివాళులర్పించిన అనంతరం సురీందర్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు.

కథువా జిల్లాలోని అడవుల్లో టెర్రరిస్టులు ఉన్నారన్న సమాచారంతో నేషనల్ సెక్యూరిటీ గార్డ్, బీఎస్ఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ బృందాలు గత ఐదు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఇంకా ముగ్గురు నలుగురు ఉగ్రవాదులు స్థానికంగా నక్కిఉన్నట్లు సమాచారం. ఆర్మీ దుస్తుల్లో ఉన్న ఉగ్రవాదులు తమను మంచి నీళ్లు అడిగారని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు వారికోసం వేట కొనసాగిస్తున్నాయి.



## ఏప్రిల్‌లో బ్యాంక్ సెలవులు..
# తెలుగు రాష్ట్రాల్లో ఇలా..

**తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఏప్రిల్ నెల బ్యాంకు సెలవు రోజుల్ని ఆర్‌బీఐ తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది.**

**ఈ-కబురు:** ఒకప్పుడు బ్యాంక్‌కు వెళ్లనిదే పనులు జరిగేవి కావు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక మెబైల్‌లోనే దాదాపు అన్ని ఆర్థిక కార్యకలాపాలూ జరిగిపోతున్నాయి. అయితే, బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవాలన్నా, లాకర్‌లో వస్తువులు దాయాలన్నా బ్యాంకులకు వెళ్లాల్సిందే. ఇవి కాకుండా ఇతర ఏ పని మీద బ్యాంకుకు వెళ్లాల్సి వస్తే.. ముందుగా ప్లాన్ చేసుకోవాలి. తీరా ఆ రోజు సెలవు అని తెలిస్తే ఇబ్బంది పడాల్సి రావొచ్చు. కాబట్టి బ్యాంకు శాఖలు పనిచేసే రోజులు తెలుసుకోవాలి. ఏప్రిల్ నెలలో చాలా రోజులు బ్యాంకులకు సెలవులు వస్తున్నాయి. దేశవ్యాప్తంగా శని, ఆదివారాలతో కలిపి దాదాపు 15 రోజుల పాటు బ్యాంకులకు సెలవులు రానున్నాయి. స్థానిక పండగల దృష్ట్యా రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య సెలవుల్లో వ్యత్యాసం ఉంటుంది. ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ఖాతాల సర్దుబాటు దృష్ట్యా బ్యాంకులు సాధారణ కార్యకలాపాలు నిర్వహించవు. ఇక ఏప్రిల్ 5న బాబూ జగ్జీవన్ రామ్ జయంతి, 14న అంబేద్కర్ జయంతి, 18న గుడ్ ఫ్రైడే కారణంగా తెలంగాణలో బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని బ్యాంకులకు జగ్జీవన్‌రామ్ జయంతి రోజు మినహా తెలంగాణ మాదిరిగానే ఏప్రిల్ 1, 14, 18 తేదీల్లో బ్యాంకులు పనిచేయవు. శని, ఆదివారాలు కలుపుకొంటే ఏప్రిల్ నెలలో తెలంగాణలో మొత్తం 11 రోజులు, ఆంధ్రప్రదేశ్‌లో 10 రోజులు బ్యాంకులు పనిచేయవు.






## ఏసీలూ పది నిమిషాల్లోనే..
# డెలివరీలు ప్రారంభించిన బ్లింకిట్

**జొమాటోకు చెందిన క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ ఏసీలనూ 10 నిమిషాల్లో డెలివరీ చేస్తామని చెబుతోంది.**

**ఈ-కబురు:** క్విక్ కామర్స్ కంపెనీలు తమ వ్యాపారాన్ని మరింత విస్తరిస్తున్నాయి. తొలుత గ్రాసరీకి మాత్రమే పరిమితమైన ఈ కంపెనీలు.. తర్వాత మొబైల్ ఫోన్లు, చిన్న చిన్న ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లనూ 10 నిమిషాల్లోనే డెలివరీ చేయడం ప్రారంభించాయి. ఇప్పుడు, జొమాటోకు చెందిన క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ మరో ముందడుగు వేసింది. ఇకపై ఏసీలనూ పది నిమిషాల్లోనే డెలివరీ చేస్తామని ప్రకటించింది. వేసవిలో ఏసీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్ట్యా బ్లింకిట్ ఏసీలను త్వరితగతిన డెలివరీని ప్రారంభించింది.

ఇందుకోసం ప్రముఖ ఏసీ తయారీ సంస్థ లాయిడ్‌తో బ్లింకిట్ జట్టుకట్టింది. ఆ కంపెనీకి చెందిన వివిధ రకాల ఏసీలను 10 నిమిషాల్లోనే అందించనున్నట్లు ఆ కంపెనీ సీఈఓ అల్బీందర్ దిండ్సా వెల్లడించారు. ప్రస్తుతానికి దిల్లీఎన్‌సీఆర్‌లో ఏసీల డెలివరీలు ప్రారంభమయ్యాయని, త్వరలో మరిన్ని నగరాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు. ఏసీ డెలివరీ అయిన 24 గంటల్లో ఇన్‌స్టలేషన్ సిబ్బంది ఏసీని కోరుకున్న చోట ఫిక్స్ చేస్తారని పేర్కొన్నారు.

# కొత్త ఏడాది.. తెలివైన పెట్టుబడి

**వైద్య ఖర్చులు అనూహ్యంగా పెరుగుతున్న ఈ కాలంలో వాటి కోసం కేవలం సొంత డబ్బుపైనే ఆధారపడితే ఇబ్బందులు తప్పవు. ఊహించని అత్యవసర వైద్య పరిస్థితులు పొదుపు సొమ్మును హరించేస్తాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్య బీమా పెరుగుతున్న వైద్య ఖర్చుల నుండి ఒక ముఖ్యమైన రక్షణ కవచంగా నిలుస్తుంది. ఆర్థిక ఒత్తిడి లేకుండా నాణ్యమైన వైద్య సంరక్షణను అందిస్తుంది. గుర్తుంచుకోండి.. మీరు ఆరోగ్యంపై పెట్టుబడి పెడుతున్నారంటే.. మీతోపాటు కుటుంబ భవిష్యత్తు కోసం కూడా పెట్టుబడి పెడుతున్నారని అర్థం.**

**సంపూర్ణ కవరేజీ**

ఆధునిక ఆరోగ్య బీమా ఆసుపత్రిలో చేరినప్పుడు మాత్రమే కాదు.. ఓపీడీ సంప్రదింపులు, టెలిమెడిసిన్, ప్రివెంటివ్ చెకప్‌లు, వెల్‌నెస్ కార్యక్రమాలను కూడా కవర్ చేస్తుంది. చాలా పాలసీలు ఇప్పుడు ప్రసూతి సంరక్షణ, మానసిక ఆరోగ్యం, రీహాబిలిటేషన్ థెరపీ వంటి సేవలతో సంపూర్ణ కవరేజీ అందిస్తున్నాయి. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక రక్షణ చాలా కీలకం. వ్యాధినిర్దిష్ట విధానాలు, క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్లు దీర్ఘకాలిక భద్రతను నిర్ధారిస్తాయి.

**పన్ను ప్రయోజనాలూ..**

ఇటు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80డి కింద గణనీయమైన పన్ను ప్రయోజనాలను అందించడంతో పాటు అటు అవసరమైన ఆరోగ్య సంరక్షణ కవరేజీని అందించే రెండు వైపులా పదునుండే కత్తిలా హెల్త్ ఇన్సూరెన్స్ పనికొస్తుంది. ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలకు పన్ను మినహాయింపులు ఉంటాయి. ఇది ఆర్థికంగా తెలివైన పెట్టుబడిగా మారుతుంది. 60 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు తమ ఆరోగ్య బీమా ప్రీమియంపై సంవత్సరానికి రూ.25,000 వరకు మినహాయింపులను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇక సీనియర్ సిటిజన్ల సిటిజన్ల విషయానికి వస్తే.. వారికి వైద్య ఖర్చులు అధికంగా ఉంటాయి కాబట్టి ఈ పరిమితి రూ.50,000 వరకు ఉంటుంది.


## జీబ్లీ స్టైల్ ఇమేజ్ ట్రెండ్..
# మీరూ ఫ్రీగా ట్రై చేస్తారా?

**ప్రస్తుతం జీబ్లీ ఇమేజెస్ ట్రెండింగ్‌లో ఉంది. దాన్ని మీరూ వినియోగించొచ్చు. ఎలాగంటే?**

**ఈ-కబురు**: ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్.. ఏ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ఓపెన్ చేసినా ఫీడ్ మొత్తం జీబ్లీ ఫొటోలతో నిండిపోతోంది. ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోన్న నయా ట్రెండ్ ఇది. ఓపెన్ ఏఐ సంస్థ ఇటీవల చాట్‌జీపీటీలో జీబ్లీ స్టూడియోను ప్రవేశపెట్టినప్పటినుంచి ఈ సదుపాయాన్ని నెటిజన్లు తెగ వినియోగిస్తున్నారు. దేశాధినేతలు, నాయకుల చిత్రాలకు యానిమేషన్ రూపం ఇస్తూ కార్టూన్ తరహా ఫొటోలను సృష్టిస్తున్నారు. ఈ సదుపాయాన్ని ఎలాంటి సభ్యత్వం లేకుండా ఇమేజ్‌లను మీరూ ఉచితంగా క్రియేట్ చేయొచ్చు. మీరూ ట్రై చేస్తారా?

ఓపెన్‌ఏఐ సంస్థ తొలుత ఈ జీబ్లీ సదుపాయాన్ని ఉచితంగా ప్రవేశపెట్టింది. అయితే ఒక్కసారిగా వినియోగం పెరగడంతో తమ జీపీయూపై అధిక భారం పడుతోందన్న కారణంతో దీనిపై లిమిట్ పెట్టింది. కేవలం రోజుకు మూడు ఫొటోలను మాత్రమే ఉచితంగా యానిమేషన్ రూపం ఇచ్చే అవకాశం కల్పిస్తోంది. అయితే చాట్‌జీపీటీ ప్లస్, ప్రో, టీమ్ సబ్‌స్క్రైబర్లకు మాత్రం ఉచితంగా ఇస్తోంది. చాట్‌జీపీటీలో లేటెస్ట్ వెర్షన్‌లోకి వెళ్లి మీరు కోరుకున్న ఇమేజ్‌ను జీబ్లీఫై అని గానీ, జీబ్లీ థీమ్‌లోకి మార్చమని గానీ ప్రాంప్ట్ ఇస్తే వెంటనే ఆ ఇమేజ్‌ను జీబ్లీ స్టైల్‌లోకి మార్చి ఇస్తుంది. ఈ ట్రెండ్ విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావడంతో ఇతర ఏఐ ప్లాట్‌ఫామ్‌లు సైతం ఇవే సదుపాయాన్ని అందిస్తున్నాయి.





**జెమినీ:** గూగుల్ ఏఐ జెమినీ సాయంతో ఉచితంగా జీబ్లీ ఇమేజ్‌లను రూపొందించొచ్చు. జెమినీ ఏఐ ప్లాట్‌ఫామ్‌లో లాగిన్ అయ్యాక.. చాట్ బాక్స్‌లోకి వెళ్లి మీరు ఏ ఇమేజ్‌ని క్రియేట్ చేయాలనుకుంటున్నారో దానిగురించి క్లుప్తంగా ప్రాంప్ట్ ఇచ్చి జీబ్లీ స్టైల్ ఇమేజ్‌ని రూపొందించమని చెప్పండి. అంతే చిటికెలో చిత్రాల్ని మీ ముందు ఉంచుతుంది. దీంతో అన్‌లిమిటెడ్‌గా ఫొటోలు క్రియేట్ చేయొచ్చు.

**గ్రోక్:** ఎక్స్‌కు చెందిన ఏఐ ప్లాట్‌ఫామ్ గ్రోక్ ప్లాట్‌ఫామ్‌లో లాగిన్ అయ్యాక ఇమేజ్ ఆప్షన్ సాయంతో మీకు నచ్చిన ఫొటోను ఎంచుకొని అప్‌లోడ్ చేయాలి. 'జీబ్లీ ఫై దిస్ ఇమేజ్' అని చిన్న ప్రాంప్ట్ ఇస్తే చాలు. ఫొటోలు క్రియేట్ చేసి ఇస్తుంది. ప్రస్తుతానికి మనం స్వయంగా ఫొటోను అందిస్తేనే యానిమేట్ చేసి పంపుతోంది.

## 'ఎక్స్'ను విక్రయించిన ఎలాన్ మస్క్..
# ఎవరికో తెలుసా?

**బిలియనీర్ ఎలాన్‌మస్క్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'ను విక్రయించినట్లు ప్రకటించారు.**

**ఈ-కబురు ,వాషింగ్టన్:** బిలియనీర్ ఎలాన్‌మస్క్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'ను విక్రయించినట్లు ప్రకటించారు. అయితే, అది బయటి వ్యక్తులకు కాదట. మస్క్ నేతృత్వంలోని కృత్రిమ మేధ అంకుర సంస్థ 'ఎక్స్‌ఏఐ' కే విక్రయించారు. ఈమేరకు మస్క్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. 33 బిలియన్ డాలర్లకు ఎక్స్‌ను అమ్మివేసినట్లు మస్క్ ప్రకటించారు. తాజాగా ఎక్స్‌ఏఐ విలువను 80 బిలియన్ డాలర్లుగా నిర్ధరించారు. ఎక్స్‌ఏఐ అధునాత ఏఐ సామర్థ్యాన్ని, ఎక్స్‌కు అనుసంధానించడం ద్వారా ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చని మస్క్ తన పోస్టులో పేర్కొన్నారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సలహాదారుగా వ్యవహరిస్తున్న మస్క్.. టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈవోగానూ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2022లో 'ట్విటర్'ను మస్క్ 44 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేశారు. అనంతరం దాని పేరును 'ఎక్స్'గా మార్చేశారు. ఎక్స్‌ను సొంతం చేసుకున్న తర్వాత సిబ్బందిని తొలగించడం, ద్వేషపూరిత ప్రసంగాలు అప్పట్లో ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.



చాట్‌జీపీటీకి పోటీగా గతేడాది మస్క్ 'ఎక్స్‌ఏఐ' పేరుతో అంకుర సంస్థను ప్రారంభించారు. "ఎక్స్‌ఏఐ, ఎక్స్ భవిష్యత్‌లు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. డేటా మోడల్‌స్‌ను అనుసంధానం చేయడం ద్వారా మరిన్ని ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు ముందడుగు వేస్తున్నాం. ఎక్స్‌ఏఐ అధునాతన సామర్థ్యం ఎక్స్ పరిధిని మరింత పెంచుతుంది" అని మస్క్ పేర్కొన్నారు. ఈ రెండు సంస్థల కలయిక కోట్లాది మంది ప్రజలకు అత్యద్భుత అనుభూతిని అందిస్తుందని మస్క్ అన్నారు.

TMB Tamilnad Mercantile Bank Ltd
Be a step ahead of life

## కరీంనగర్‌లో కొత్త శాఖ ప్రారంభం

**దేశవ్యాప్తంగా విస్తరించిన ప్రముఖ 'తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు' దేశంలో తెలంగాణతో సహా మరో 6 కొత్త శాఖలను వివిధ రాష్ట్రాల్లో ప్రారంభించినట్లు ఈ రోజు ప్రకటించింది.**


**ఈ-కబురు:** తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ తన విస్తరణ ప్రణాళికలో భాగంగా వివిధ రాష్ట్రాలలో ఆరు కొత్త శాఖలను ప్రారంభించింది. కొత్తగా ప్రారంభించిన బ్యాంకు శాఖల్లో ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యలో ఒక శాఖ ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్‌లో కూడా ఒక శాఖ ఉంది. మిగతా నాలుగు కొత్త శాఖలను తమిళనాడు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసింది. దేశమంతటా సమీప భవిష్యత్తులో మరిన్ని శాఖలను తెరవాలనే ప్రణాళికను కలిగి ఉన్నామని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సలీ ఎస్ నాయర్ ఈ రోజు( శనివారం) ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త శాఖలతో సహా తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్..17 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలలో 578 శాఖలు, 12 ప్రాంతీయ కార్యాలయాలను కలిగి ఉందని బ్యాంకు

# ఇకపై వాట్సాప్ స్టేటస్‌లో
## సాంగ్ యాడ్ చేయొచ్చు.. ఎలా అంటే?

**ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ కొత్త ఫీచర్‌ని అందుబాటులోకి తెచ్చింది. ఏంటా ఫీచర్? ఎలా ఉపయోగించాలంటే?**


**ఈ-కబురు:** తక్షణ సందేశం పంపాలన్నా, ఫొటోలు పంచుకోవాలన్నా వెంటనే గుర్తుకువచ్చే మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ . ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు, అప్‌డేట్లను అందిస్తూ యూజర్లను ఆశ్చర్యానికి గురిచేస్తుందీ యాప్. తాజాగా మరో కొత్త సదుపాయంతో ముందుకొచ్చింది. స్టేటస్‌లో పాటల్ని జోడించే ఫీచర్‌ని తీసుకొచ్చింది. దీన్ని ఎలా వినియోగించాలంటే?

సాధారణంగా ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ అప్‌లోడ్ చేసేటప్పుడు పోస్ట్‌కు తగ్గట్టుగా మనకు నచ్చిన పాటను ఎంచుకొనే సదుపాయం ఉంది. ఇలా తాత్కాలిక మ్యూజిక్ క్లిప్‌లను జోడించే సదుపాయాన్ని వాట్సప్ కూడా ప్రవేశపెట్టింది. అచ్చం ఇన్‌స్టాగ్రామ్‌లానే ఇకపై స్టేటస్‌లో 24 గంటల పాటు వారి ఫొటోలు, టెక్స్ట్, వీడియోలకు పాటలు జోడించొచ్చు. మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ఈ ఫీచర్‌ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసింది. ఇప్పటికే చాలామంది యూజర్లకు ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది.



**మ్యూజిక్ యాడ్ ఎలా?**

సాధారణంగా వాట్సప్‌లో స్టేటస్ సెలెక్ట్ చేసుకొనేలాగా ఆప్షన్‌పై క్లిక్ చేసి గ్యాలరీలో మీకు నచ్చిన ఫొటో వీడియో ఏదో ఒకటి సెలెక్ట్ చేసుకోవాలి. ఎంచుకోగానే క్రాప్, స్టిక్కర్, టెక్స్ట్, ఎడిట్ ఆప్షన్లు సాధారణంగా స్క్రీన్‌పై కనిపిస్తాయి. వాటిముందే మ్యూజిక్ ఐకాన్ కొత్తగా దర్శనమిస్తుంది. దాన్ని క్లిక్ చేసి మీకు నచ్చిన పాటను ఎంచుకోవచ్చు. అయితే ఇలా ఫొటో కోసం 15 సెకన్లు, వీడియో కోసం 60 సెకన్ల వరకు పాటను ఎంచుకోవచ్చు. పాట ఎక్కడినుంచి ప్లే కావాలని కోరుకుంటున్నారో అలా అడ్జెస్ట్ చేసుకొనే సదుపాయం కూడా ఉంది.





# తిరిగి సినిమాల్లోకి వస్తానంటే వద్దన్నారు: జెనీలియా

**సుమారు 10 ఏళ్ల విరామం తర్వాత తిరిగి సినిమాల్లో నటించడంపై నటి జెనీలియా స్పందించారు. కమ్‌బ్యాక్ గురించి మాట్లాడినప్పుడు తనకు ఎవరూ సపోర్ట్ చేయలేదన్నారు.**

**ఈ-కబురు ,ముంబయి:** సుమారు 10 ఏళ్ల విరామం తర్వాత 'వేద్'లో యాక్ట్ చేసి విజయాన్ని అందుకున్నారు నటి జెనీలియా. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ఇన్నేళ్ల పాటు విరామం తీసుకోవడానికి గల కారణం గురించి మాట్లాడారు. కమ్ బ్యాక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నప్పుడు.. తెలిసిన వాళ్లు ఎవరూ ప్రోత్సహించలేదని చెప్పారు. వారి మాటల వల్ల తాను ఎంతో బాధపడ్డానని అన్నారు.

''కెరీర్ పరంగా సక్సెస్ లేదా ఫెయిల్యూర్‌కు నేను ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వను. జయాపజయాలు మన జీవితంలో భాగమే. కాబట్టి, వాటి కంటే కూడా, మనం ఎలా జీవితాన్ని కొనసాగిస్తున్నామనేది ముఖ్యం. ఒక నటిగా దాదాపు ఆరు భాషల్లో పనిచేశా. పిల్లలు పుట్టిన తర్వాత యాక్టింగ్‌కు దూరం కావాలనిపించింది. ఇటీవల తిరిగి కమ్ బ్యాక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నప్పుడు తెలిసిన వాళ్లెవరూ ప్రోత్సహించలేదు. 'పదేళ్ల తర్వాత తిరిగి సినిమాల్లోకి వస్తున్నావా? ఇది ఏమాత్రం వర్కౌట్ కాదు' అని నిరాశ పరిచారు. ధైర్యం చేసి సినిమాల్లోకి తిరిగి వచ్చా. రితేశ్‌తో కలిసి నటించిన 'వేద్' మంచి విజయాన్ని అందుకుంది. కాబట్టి అన్ని విషయాల్లో ఇతరులను నమ్మడానికి లేదు'' అని జెనీలియా చెప్పారు. ఈ పదేళ్ల కాలంలో తన గురించి, పిల్లలు, కుటుంబం గురించి మాత్రమే తాను ఎక్కువగా దృష్టి పెట్టానని వివరించారు.
ముంబయికి చెందిన జెనీలియా 'తుజే మేరీ కసమ్' (2003)తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. తెలుగులో 'సై', 'బొమ్మరిల్లు', 'రెడీ' వంటి ఎన్నో కుటుంబ, ప్రేమ కథా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. తొలి సినిమా షూటింగ్ సమయంలోనే ఆమెకు బాలీవుడ్ నటుడు రితేశ్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలానికి వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. వివాహం తర్వాత ఆమె సినిమాలకు దూరమయ్యారు. సుమారు 10 ఏళ్లు విరామం తీసుకున్నారు. ఇటీవల 'వేద్'తో రీ ఎంట్రీ ఇచ్చారు. 'మజిలీ' చిత్రానికి మరాఠీ రీమేక్‌గా వచ్చిన సినిమానే 'వేద్'. జెనీలియా యాక్టింగ్‌ను సినీ ప్రియులు మెచ్చుకున్నారు. గృహిణి పాత్రలో ఆమె ఒదిగిపోయారన్నారు.


# సిద్ధార్థ్ ఎంతో సరదా మనిషి.. అదితిరావ్ హైదరీ

**తన భర్త, నటుడు సిద్ధార్థ్ ఎంతో సరదా మనిషి అని నటి అదితిరావ్ హైదరీ తెలిపారు. తన ఇష్టానికి అతడు ఎక్కువ విలువ ఇస్తారని అన్నారు.**

**ఈ-కబురు ,ముంబయి:** తన భర్త, నటుడు సిద్ధార్థ్ ఎంతో సరదా మనిషి అని నటి అదితిరావ్ హైదరీ తెలిపారు. తన ఇష్టానికి ఆయన ఎక్కువ విలువ ఇస్తారని చెప్పారు. ఆయనతో ఉంటే తాను ఎంతో సంతోషంగా ఉంటానని తాజాగా ఓ కార్యక్రమంలో చెప్పారు.

''నాకు, నా కుటుంబానికి సిద్ధూ ఎంతో విలువ ఇస్తుంటాడు. కుటుంబసభ్యులతో కలివిడిగా ఉంటాడు. కలిసి ఉండటం తనకు బాగా నచ్చుతుంది. ఉమ్మడి కుటుంబంలో పుట్టి పెరిగిన నాకు అతనిలో ఆ లక్షణం ఎంతగానో నచ్చింది. వ్యక్తిగతంగా తను చాలా సరదా మనిషి. చుట్టూ ఉన్నవాళ్లను సంతోషంగా ఉంచాలనుకుంటాడు. తనతో పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడు.. నేను ఒక్క నిమిషం కూడా ఆలోచించలేదు. వెంటనే ఓకే చెప్పేశాను'' అని ఆమె చెప్పారు. సిద్ధార్థ్ అద్భుతంగా పాడతాడని, డ్యాన్స్ చేస్తాడని అదితి తెలిపారు. తన దృష్టిలో ఆయన గొప్ప నటుడని అన్నారు.

2021లో విడుదలైన 'మహాసముద్రం' కోసం సిద్ధార్థ్, అదితి తొలిసారి కలిసి వర్క్ చేశారు. ఆ సినిమా షూట్‌లోనే వీరిద్దరి మధ్య స్నేహం కుదిరింది. కొంతకాలానికి అది ప్రేమకు దారి తీసింది. హైదరాబాద్‌లో తన నాన్నమ్మ కట్టించిన స్కూల్ తమ కుటుంబానికి ఎంతో ప్రత్యేకమని.. ఆ పాఠశాల వేదికగా సిద్ధార్థ్ తనకు ప్రపోజ్ చేశాడని అదితి ఓ సందర్భంలో చెప్పారు. ఆయన ప్రేమను వ్యక్తపరిచిన తీరు తనకెంతో నచ్చిందన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో సిద్ధార్థ్ అదితి వివాహం జరిగింది.





# దర్శకుడు లేరని చెప్పినా.. ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌పై విజయ్ దేవరకొండ

**తాను హీరోగా నటిస్తున్న 'కింగ్‌డమ్' టీజర్‌కు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇవ్వడంపై విజయ్ దేవరకొండ స్పందించారు. ఓ కార్యక్రమంలో ఆసక్తికర విషయాలు చెప్పారు.**



**ఈ-కబురు:** విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న సినిమా 'కింగ్‌డమ్'. ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో ఈ మూవీ టీజర్ ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. తాజాగా పాల్గొన్న ఓ కార్యక్రమంలో విజయ్ తెర వెనుక సంగతులతోపాటు మరికొన్ని విషయాలు పంచుకున్నారు. ''టీజర్ కోసం వాయిస్ ఓవర్ రాసిన సమయంలోనే ఎన్టీఆర్ అన్న చెబితే బాగుంటుందని అనుకున్నాం. ఆయన్ను కలిసి విషయం చెప్పా. కాసేపు ముచ్చటించిన తర్వాత.. ఈ సాయంత్రం చేసేద్దాం అన్నారు. దర్శకుడు చెన్నైలో ఉన్నారని, టీజర్‌కు సంబంధించిన మ్యూజిక్ వర్క్‌లో బిజీగా ఉన్నారని చెప్పా. 'ఏం ఫర్వాలేదు. నువ్వు ఉన్నావ్‌గా' అని అన్నారు. ఆ డైలాగ్స్ ఆయనకు అంతగా నచ్చాయి. అద్భుతంగా వాయిస్ ఓవర్ ఇచ్చారు. అన్నను అంతకుముందు నేను ఎక్కువ సార్లు మీట్ అవ్వకపోయినా.. మా టీజర్‌కు వాయిస్ ఓవర్ ఇవ్వడం ప్రత్యేకం అనిపించింది. హిందీ వెర్షన్ కోసం రణ్‌బీర్ కపూర్‌ని, తమిళ్ వెర్షన్ కోసం సూర్య సర్‌ని అడగ్గానే ఓకే చెప్పారు'' అని గుర్తుచేసుకున్నారు.

''కొన్నాళ్ల క్రితం నేను మీలో చాలామందికి తెలియదు. ఇప్పుడు ఎంతోమంది నన్ను, నా పనిని గుర్తించడం ఎంతో ఆనందంగా ఉంది. నాకు ఇష్టమైన పనిని చేస్తున్నా. మరింత కష్టపడుతూ ప్రేక్షకులకు వినోదం పంచాలనుకుంటున్నా. నేనీ స్థాయిలో ఉన్నానంటే దానికి కొత్త దర్శకులు కూడా కారణం. సందీప్‌రెడ్డి వంగా, తరుణ్ భాస్కర్‌లాంటి వారు తమ తొలి సినిమాని నాతో తెరకెక్కించారు. మనల్ని ప్రోత్సహించే వారంటూ ఉండాలి. తెలుగు సినిమాలు భారీ స్థాయిలో విజయవంతమవడం సంతోషంగా ఉంది. టాలీవుడ్‌లో చాలామంది గొప్ప దర్శకులున్నారు. టెక్నాలజీ వినియోగించుకోవడంలో ముందుంటాం'' విజయ్ పేర్కొన్నారు. ఇక దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతో విజయ్ దేవరకొండ కలిసి ఫొటో దిగారు. దీంతో ఈ ఫొటో వైరల్‌గా మారింది.

# 'డీజే టిల్లు' టైటిల్ మార్చడానికి కారణమదే: సిద్ధూ జొన్నలగడ్డ

**'డీజే టిల్లు' తో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్నారు నటుడు సిద్ధూ జొన్నలగడ్డ . తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్ గురించి మాట్లాడారు. 'డీజే టిల్లు' టైటిల్ మార్చడానికి గల కారణాన్ని బయటపెట్టారు.**



**ఈ-కబురు,హైదరాబాద్:** 'డీజే టిల్లు'తో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్నారు నటుడు సిద్ధూ జొన్నలగడ్డ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు వేశారు. సినిమాల్లోకి రావాలని తాను ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఇంజినీరింగ్ పూర్తైన తర్వాత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఆఫర్ తనకు నచ్చలేదని ఆయన తెలిపారు.

''ఇంజినీరింగ్ పూర్తైన తర్వాత ఎం.ఎస్.చేయడానికి విదేశాలకు వెళ్లడం అందరూ చేస్తుంటారు. నా కుటుంబంలోనూ చాలామంది అదే చేశారు. నేను కూడా అదే రూట్‌లో ప్రయాణించాల్సింది. విదేశాలకు వెళ్లే ప్రోసెస్ గురించి ఇంట్లో వాళ్లు నాతో చెప్పారు. రూ.20 లక్షలు అప్పు తీసుకొని నన్ను అక్కడికి పంపిస్తామని.. వారంలో మూడు రోజులు క్లాసులు ఉంటాయని.. మిగిలిన రోజులు బర్గర్ షాపులో పనిచేసి వచ్చిన డబ్బుతో అప్పులు కట్టాలన్నారు. అది నాకు ఏమాత్రం నచ్చకపోవడంతో ఇక్కడే ఉండిపోయా. అలాంటి సమయంలో ఆన్‌లైన్‌లో నాకొక ఆడిషన్ కాల్ కనిపించింది. సరదాగా వెళ్లాను. అవకాశం వచ్చింది. కొన్ని సినిమాల్లో చిన్నచిన్న రోల్స్ చేశాను. ఆ తర్వాత యాక్టింగ్‌లోనే ఉండాలనిపించింది'' అని సిద్ధూ జొన్నలగడ్డ తెలిపారు.
అనంతరం ఆయన 'డీజే టిల్లు' గురించి మాట్లాడుతూ.. ''డీజే టిల్లు' చిత్రానికి తొలుత మేము 'నరుడి బ్రతుకు నటన' అనే టైటిల్ అనుకున్నాం. ఆ టైటిల్‌ను మాకంటే ముందు వేరే వాళ్లు రిజిస్టర్ చేయించుకుంటే.. వాళ్లకు సుమారు రూ.4 లక్షలు ఇచ్చి మరీ కొనుగోలు చేశాం. తీరా, స్నేహితులతో మా కథ డిస్కస్ చేస్తున్నప్పుడు టైటిల్ చెప్పగానే ఇదొక సాధారణ చిత్రమే అనుకొని ఎవరూ వినేవారు కాదు. ఓసారి త్రివిక్రమ్ సర.. మా టైటిల్ విని.. ఇదొక మధ్యతరగతి వ్యక్తి కథ అనుకున్నారు. దాంతో మేము, టైటిల్ మార్చాలని నిర్ణయించుకున్నాం. కథలోని హీరో పాత్ర పేరు (డీజే టిల్లు) నే టైటిల్‌గా పెడితే బాగుంటుందని నిర్ణయించుకున్నాం'' అని వివరించారు. సిద్ధూ జొన్నలగడ్డ ప్రస్తుతం 'జాక్', 'తెలుసు కదా' చిత్రాల కోసం వర్క్ చేస్తున్నారు.



# తమన్నాతో బ్రేకప్.. రిలేషన్‌షిప్‌పై విజయ్ వర్మ వ్యాఖ్యలు

**నటి తమన్నా, నటుడు విజయ్ వర్మ విడిపోయారంటూ గత కొంతకాలంగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రిలేషన్‌షిప్‌పై తన అభిప్రాయాన్ని తెలియజేశారు విజయ్ వర్మ.**



**ఈ-కబురు ,ముంబయి:** 'లస్ట్ స్టోరీస్ 2' తో పరిచయమై.. కొంత కాలానికే ప్రేమలో పడ్డారు తమన్నా, విజయ్ వర్మ . సుమారు రెండేళ్ల పాటు ప్రేమలో ఉన్న వీరిద్దరూ ఇటీవల బ్రేకప్ చెప్పేసుకున్నారని గత కొన్ని రోజులుగా కథనాలు వెలువడుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఈ వార్తలు వైరల్‌గా మారిన తరుణంలో తాజాగా నటుడు విజయ్ వర్మ రిలేషన్‌షిప్‌ను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రిలేషన్‌షిప్‌లోని ప్రతి విషయాన్ని ఆనందించాలని ఆయన అన్నారు. ఒక బంధాన్ని సంతోషంగా మార్చుకొనే సమయంలో ఎలాంటి పరిణామాలు ఎదురైనా వాటిని స్వీకరించాలన్నారు.

''రిలేషన్‌షిప్‌ను ఒక ఐస్‌క్రీమ్ మాదిరిగా ఆద్యంతం ఆస్వాదించాలి. అలా చేసినప్పుడే నువ్వు సంతోషంగా ఉండగలవు. సంతోషం, బాధ, కోపం, చిరాకు.. ఇలా ప్రతి అంశాన్ని నువ్వు స్వీకరించాలి. దానితోపాటు ముందుకుసాగాలి'' అని ఆయన అన్నారు. మరోవైపు, తమన్నా సైతం ఇటీవల ప్రేమ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. నిస్వార్థమైన ప్రేమను తాను నమ్ముతానని అన్నారు. ప్రేమను ఎప్పుడైతే వ్యాపార లావాదేవీగా చూడటం మొదలుపెడతామో అప్పుడే అసలు సమస్యలొస్తాయని ఆమె చెప్పుకొచ్చారు. రిలేషన్‌లో ఉన్నప్పుడు కంటే లేనప్పుడే తాను ఆనందంగా ఉన్నానని.. భాగస్వామి ఎంపిక విషయంలో ఒకింత జాగ్రత్తగా ఉండాలంటూ ఒకరకమైన హెచ్చరిక చేశారు.

2023లో విడుదలైన 'లస్ట్ స్టోరీస్ 2' కోసం తొలిసారి కలిసి వర్క్ చేశారు తమన్నా, విజయ్ వర్మ. ఈ సిరీస్ చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో ఈ జంట బయటపెట్టింది. రిలేషన్‌లో ఉన్నప్పుడు ప్రతి ఫంక్షన్‌కు కలిసి హాజరైన ఈ జంట.. ఇటీవల జంటగా ఎక్కడా కనిపించడం లేదు. దీంతో వీరిద్దరూ విడిపోయారని ప్రచారం సాగుతోంది. ఆ వార్తలపై వీరిద్దరూ స్పందించలేదు కానీ, రవీనాటాండన్ ఇంట జరిగిన హోలీ వేడుకలకూ వేర్వేరుగానే వచ్చారు. అంతేకాకుండా ఆమె షేర్ చేసిన ఫొటోల్లో ఆయన కనిపించలేదు. ఆయన పంచుకున్న ఫొటోల్లో తమన్నా జాడే లేదు.

# అవన్నీ నా నిర్ణయాలే.. ఆ అవకాశం కూడా వస్తుందేమో

**సల్మాన్ కథానాయకుడిగా మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సికిందర్'. రంజాన్ కానుకగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో రష్మిక పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు.**

**ఈ-కబురు:** ఒక నటుడి నుంచి స్టార్‌ను వేరే చేసిది వాళ్ల ఎంపికలేనని కథానాయిక రష్మిక అన్నారు. సల్మాన్‌ఖాన్‌తో కలిసి ఆమె నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ 'సికిందర్'. ఏఆర్ మురుగదాస్ దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం రంజాన్ సందర్భంగా మార్చి 30న ప్రేక్షకులను పలకరించడానికి రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో సల్మాన్‌తో రష్మిక కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త సవాళ్లను ఎప్పుడూ స్వీకరిస్తానని తెలిపారు. అంతేకాదు, దక్షిణాదిలో ఉన్న పోటీతత్వంపైనా మాట్లాడారు. ''మీ ఎంపికలే మిమ్మల్ని నటుడి నుంచి స్టార్‌గా వేరు చేస్తాయి' అని ఓ పుస్తకంలో చదివాను. వివిధ చిత్ర పరిశ్రమల్లో పనిచేయాలనుకోవడం నా ఛాయిస్. కన్నడ, తెలుగు, తమిళ, హిందీలో చేశా. రాబోయే రోజుల్లో మలయాళంలోనూ చేయాలనుంది. ఆ అవకాశం కూడా వస్తుందని ఆశిస్తున్నా. ఇప్పటివరకూ నేను చేసిన సినిమాలన్నీ నా సొంత నిర్ణయాలే. నాకెవరి నుంచి సూచనలు, సలహాలు లేవు. కూర్గ్ నుంచి కన్నడ పరిశ్రమకు వచ్చి, అక్కడ తొలి అవకాశాన్ని అందుకున్నాను, ఆ తర్వాత తమిళ, హిందీ భాషల్లో నటించాను అదే సమయంలో వారెవరూ నాకు తెలియదు. నా జీవితం నాదే. ఈ నిర్ణయాల వల్ల రేపు ఏం జరిగినా దానికి పూర్తి బాధ్యత కూడా నాదే. ఇక పోటీ అంటారా? దానితో నాకు సంబంధం లేదు. ప్రతి ఒక్కరూ తమ పని తాము చేసుకుంటూ వెళ్లడమే'' అని రష్మిక అభిప్రాయపడ్డారు.
రష్మిక మాటలను సల్మాన్ కొనసాగిస్తూ, పోటీతత్వం ఉండాలని అన్నారు. అది మనం మరింత ఎదగడానికి ఉపయోగపడుతుందని వ్యాఖ్యానించారు. అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తున్న రష్మిక.. ఆయా రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడి భాషనే మాట్లాడతానని తెలిపారు. ముఖ్యంగా హిందీలో మాట్లాడేటప్పుడు ఎక్కడ తప్పుగా మాట్లాడతానోనని మరింత జాగ్రత్తగా ఉంటానని వివరించారు. ఇటీవల విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో రూపొందిన 'ఛావా'తో మంచి విజయాన్ని అందుకున్న రష్మిక... ఇప్పుడు 'సికిందర్'తో అలరించడానికి సిద్ధమయ్యారు. అలాగే శేఖర్ కమ్ముల దర్శకత్వంలో 'కుబేర'తో పాటు,'ది గర్ల్‌ఫ్రెండ్', 'థామా' చిత్రాల్లోనూ నటిస్తున్నారు.




## సెంట్రల్ కాంట్రాక్ట్‌లోకి కొత్త పేరు..?

# బీసీసీఐ మీటింగ్ వాయిదా!

**కీలకమైన బీసీసీఐ మీటింగ్ వాయిదా పడినట్లు సమాచారం. గువాహటిలో ఈ సమావేశం జరగాల్సి ఉంది. అయితే, ఎందుకు వాయిదా పడిందో కారణం మాత్రం తెలియడం లేదు.**

**ఈ-కబురు:** గువాహటి వేదికగా ఇవాళ జరగాల్సిన సమావేశాన్ని బీసీసీఐ (BCCI) వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌తో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఇతర అధికారులు సమావేశం కావాల్సి ఉంది. సెంట్రల్ కాంట్రాక్ట్‌లు, ఇంగ్లాండ్ పర్యటన సన్నద్ధతపై చర్చించాల్సి ఉంది. ఇప్పుడు కొత్త తేదీకి మీటింగ్‌ను మార్చినట్లు కథనాలు వస్తున్నాయి. అయితే, ఎప్పుడనేది ఇంకా తెలియరాలేదు. ప్రధాన కోచ్ గంభీర్ కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్లిన సంగతి తెలిసిందే. అతడు అందుబాటులో లేకపోవడమూ సమావేశం వాయిదాకు కారణమై ఉండొచ్చని తెలుస్తోంది.

**వారితో చర్చించాకనే..**

ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్‌తో బీసీసీఐ ప్రధానంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టు భవిష్యత్తుపై చర్చించనుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో కొనసాగించడంపైనా.. భారత టెస్టు జట్టుకు కొత్తగా ఎవరిని సారథిగా నియమించాలి? అలాగే సెంట్రల్ కాంట్రాక్ట్‌ల్లో A+ జాబితాలోని రోహిత్, విరాట్, బుమ్రా, జడేజాను కొనసాగిస్తారా? లేదా? అనేది కీలక పాయింట్. టీ20 ప్రపంచ కప్ ముగిసిన తర్వాత రోకో రాకుండా జడేజా కూడా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అన్నింట్లోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే వారికే A+ ఇవ్వాలనేది కొందరి వాదన. అయితే, ఇప్పటికైతే వీరి సెంట్రల్ కాంట్రాక్ట్‌లో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చనేది పలువురి అభిప్రాయం. ఇక ఇంగ్లాండ్‌తో జూన్‌లో టెస్టు సిరీస్‌ను ఆడనుంది. జట్టు ఎంపికతోపాటు సన్నద్ధతపై తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా ఇందులో చర్చ జరగనుంది.

**వరుణ్‌కు అవకాశం..**

ఛాంపియన్స్ ట్రోఫీలో అదరగొట్టిన వరుణ్ చక్రవర్తి కి బంపర్ ఆఫర్ తగలనుంది. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ లో చోటు దక్కే అవకాశం ఉంది. అతడితోపాటు గతంలో కాంట్రాక్ట్‌లను కోల్పోయిన శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ పేర్లనూ చేర్చడం ఖాయంగానే కనిపిస్తోంది. అదే సమయంలో కాంట్రాక్ట్‌ల్లో పలువురికి పదోన్నతి లభించే ఛాన్స్ లేకపోలేదు.

## 50 పరుగులేగా.. భారీ మార్జిన్‌తో ఓడలేదు:

# రుతురాజ్ గైక్వాడ్



**IPL 2025: ఐపీఎల్ తొలి సీజన్‌లో విజయం సాధించిన తర్వాత చెపాక్‌లో మరో గెలుపు కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 17 ఏళ్లు ఆగాల్సి వచ్చింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నైపై బెంగళూరు విజయం సాధించింది.**

**ఈ-కబురు:** చెపాక్‌లో తిరుగులేని చెన్నై సూపర్ కింగ్స్‌కు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు షాక్ ఇచ్చింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో సీఎస్కేకు మొదటి ఓటమి ఎదురైంది. మరోవైపు ఆర్సీబీ వరుసగా రెండు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. అయితే, ఈ ఓటమిపై తాము ఎలాంటి ఆందోళనకు గురి కావడం లేదని చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వ్యాఖ్యానించాడు. ఇది పెద్ద మార్జిన్ కూడా కాదని పేర్కొన్నాడు.

"ఈ పిచ్‌పై ఆర్సీబీని 170 పరుగులకే పరిమితం చేస్తామనుకున్నాం. ఇక్కడ బ్యాటింగ్ చేయడం చాలా కష్టం. ఫీల్డింగ్‌లోనూ మాకు కలిసిరాలేదు. 170 పరుగుల లక్ష్యం ఛేదించాల్సి వచ్చినప్పుడు పరిస్థితి వేరుగా ఉంటుంది. కానీ మేం అదనంగా 20 పరుగులు ఇచ్చాం. అప్పుడు ఛేదన ఇంకాస్త కఠినంగా మారుతుంది. బంతి పాతబడిన కొద్దీ ఆడటం ఇబ్బందికరమే. పవర్‌ప్లేలోనూ దూకుడుగా ఆడాల్సింది. కానీ, కొత్త బంతిని ఎదుర్కోవడం కష్టమైంది. ఇలా జరగడానికి కారణమేంటో తెలియదు. నా షాట్ల ఎంపికలో తప్పులేదు. కొన్నిసార్లు కలిసిరాదు. అయినా మేం 50 పరుగుల తేడాతోనే ఓడాం. ఇదేమీ భారీ మార్జిన్ కాదు. క్యాచ్‌లను డ్రాప్ చేయడం.. ఆ తర్వాత సిక్స్ లేదా ఫోర్ కొట్టడంతో మా బౌలర్లపై కాస్త ఒత్తిడి పెరిగింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మాకు కలిసిరాని రోజున ఫలితం అనుకూలంగా రాలేదు. తర్వాత మ్యాచ్ కోసం మళ్లీ సిద్ధమవుతాం. గువాహటి వేదికగా మ్యాచ్ జరగనుంది. ఐపీఎల్‌లో ఫీల్డింగ్ అత్యంత కీలకం. ఈ విషయంలో మేం మరింత మెరుగవుతాం" అని రుతురాజ్ వెల్లడించాడు.

**మా టార్గెట్ అదే: రజత్ పటీదార్**

"ఈ పిచ్‌పై మేం నిర్దేశించిన లక్ష్యం సరిపోతుంది. బంతి వేగంలో చాలా తేడా ఉంది. బ్యాటింగ్ చేయడం చాలా కష్టం. చెపాక్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆడటం ఎప్పుడూ స్పెషలే. ఇక్కడ ఆ జట్టుకు ఫ్యాన్స్ ఫాలోయింగ్ ఎక్కువ. కనీసం 200 పరుగుల టార్గెట్ ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కాస్త దగ్గరగా వచ్చాం. జోష్ హేజిల్ వుడ్ స్పెల్‌లో వికెట్లు తీయడం మాకు కలిసొచ్చింది. యశ్ కూడా కీలక సమయంలో వికెట్లు పడగొట్టడంతో మా పని తేలికైంది" అని ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ వెల్లడించాడు. హాఫ్ సెంచరీ సాధించిన రజత్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# ధోని నుంచి మరో మెరుపు

**43 ఏళ్ల వయసులో కుర్రాళ్లకు ఏమాత్రం తీసిపోని చురుకుదనం చూపిస్తున్న మహేంద్రసింగ్ ధోని.. మరోసారి తన మార్కు స్టంపింగ్‌తో ఐపీఎల్ వీక్షకులను ఆశ్చర్యపరిచాడు.**

**సాల్ట్‌ను స్టంపౌట్ చేస్తున్న ధోని**

**ఈ-కబురు:** 43 ఏళ్ల వయసులో కుర్రాళ్లకు ఏమాత్రం తీసిపోని చురుకుదనం చూపిస్తున్న మహేంద్రసింగ్ ధోని .. మరోసారి తన మార్కు స్టంపింగ్‌తో ఐపీఎల్ వీక్షకులను ఆశ్చర్యపరిచాడు. నూర్ బౌలింగ్‌లో అతను ఫిల్ సాల్ట్‌ను స్టంపింగ్ చేసిన తీరు అసాధారణం. బంతిని ఫ్రంట్ ఫుట్ మీద ఆడేందుకు సాల్ట్ కాలు కొంచెం ముందుకు కదిపి వెంటనే క్రీజులో పెట్టేశాడు. ఇదంతా రెప్పపాటు వ్యవధిలో జరిగింది. కానీ అంత తక్కువ సమయంలోనే ధోని స్టంపింగ్ చేసేశాడు. సాల్ట్ తాను నాటౌట్ అన్న ధీమాతో నవ్వుతూ కనిపించాడు. కానీ రీప్లే చూశాక ధోని చురుకుదనానికి అందరితో పాటు తానూ షాకై పెవిలియన్ చేరాడు. గత మ్యాచ్‌లో ముంబయి బ్యాటర్ సూర్యకుమార్‌ను సైతం ధోని అద్భుత రీతిలో స్టంపౌట్ చేసిన సంగతి తెలిసిందే.



## ముంబయి ఇండియన్స్‌పై

# గుజరాత్ విజయం

**ఐపీఎల్ 2025లో భాగంగా ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 36 పరుగుల తేడాతో విజయం సాధించింది.**

**ఈ-కబురు,అహ్మదాబాద్:** ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ బోణీ కొట్టింది. ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 36 పరుగుల తేడాతో విజయం సాధించింది. 197 పరుగుల లక్ష్యఛేదనలో ముంబయి 160/6కి పరిమితమైంది. ముంబయి బ్యాటర్లలో సూర్యకుమార్ యాదవ్ (48), తిలక్ వర్మ (39) మాత్రమే రాణించారు. ఓపెనర్లు రోహిత్ శర్మ (8), రియాన్ రికెల్‌టన్ (6).. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రాబిన్ మింజ్ (3) సింగిల్ డిజిట్ స్కోరుకు పరిమితమయ్యారు. హార్దిక్ పాండ్య (11), నమన్ ధీర్ (18*), మిచెల్ శాంట్నర్ (18*) పరుగులు చేశారు. సూర్యకుమార్, తిలక్ వర్మ నిలకడగా ఆడటంతో ముంబయి 11 ఓవర్లకు 97/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. అనంతరం గుజరాత్ బౌలర్లు పుంజుకున్నారు. వరుసగా వికెట్లు పడగొట్టడంతోపాటు పరుగులు కట్టడి చేశారు. చివరి 9 ఓవర్లలో ముంబయి 63 పరుగులు చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ (2/18), మహ్మద్ సిరాజ్ (2/34) అదరగొట్టారు. కగిసో రబాడ, సాయి కిషోర్ తలో వికెట్ పడగొట్టారు.



టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (63; 41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. శుభ్‌మన్ గిల్ (38; 27 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), జోస్ బట్లర్ (39; 24 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. కగిసో రబాడ (7), సాయి కిషోర్ (1) నాటౌట్‌గా నిలిచారు. ముంబయి బౌలర్లలో హార్దిక్ పాండ్య 2, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, ముజీబుర్ రెహమాన్, సత్యనారాయణ రాజు తలో వికెట్ పడగొట్టారు.

## "ఆ హీరో రికార్డ్ .. ఐపీఎల్‌లో బద్దలవుతుందా? 5

**టీ20ల్లో బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించే బ్యాటర్లు ఎక్కువగా సిక్స్‌లు కొట్టేందుకు మొగ్గు చూపిస్తారు. ఐపీఎల్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్ గేల్. అతడి రికార్డును కొట్టాలంటే తేలికైన విషయం కాదు.**

**ఈ-కబురు:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో రికార్డులకు కొదవలేదు. కొన్నింటిని బద్దలు కొడితే.. మరికొన్నింటి వైపు కనీసం వెళ్లడమూ కష్టమే. ఇలాంటి జాబితాలో 'సిక్సుల' రికార్డూ ఒకటి. మరి ఈ జాబితాలో ఎవరు ఉన్నారు? ఆ రేసులో నిలిచిందెవరు? ఐపీఎల్‌లో బ్యాటర్ల దూకుడు తెలిసిందే. బౌండరీలతో విరుచుకుపడటం సహజమే. స్టాండ్స్ అవల బంతిని పంపించేందుకు బ్యాటర్లు ఆసక్తి చూపిస్తారు. 'కొడితే సిక్స్ కొట్టాలిరా' అన్నట్లుగా మోత మోగించే ఐపీఎల్‌లో యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్. అతడు 142 మ్యాచుల్లో 357 సిక్స్‌లు కొట్టాడు. ఐపీఎల్‌లో ఇదే బెస్ట్ రికార్డు. మరి క్రిస్ గేల్ 'సిక్స్'ల ఘనతను సాధించాలంటే ముగ్గురికే అవకాశం ఉంది. అదీనూ భారత్‌కు చెందిన వారే కావడం గమనార్హం. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ (280), విరాట్ కోహ్లీ (276), ఎంఎస్ ధోనీ (254) మాత్రమే రేసులో నిలిచారు. గేల్‌ను రోహిత్ అధిగమించాలంటే ఇంకా 78 సిక్స్‌లు బాదాలి. అలా జరగాలంటే ఇప్పుడీ సీజన్‌తోపాటు కనీసం మరో రెండు ఎడిషన్లు ఆడితేనే సాధ్యమనేది క్రికెట్ విశ్లేషకుల మాట.

## ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో

# ముందు వచ్చి ఉంటే..: షేన్ వాట్సన్

**ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందు వచ్చి ఉంటే చెన్నై సూపర్ కింగ్స్ గెలిచి ఉండేదని ఆస్ట్రేలియా మాజీ ఆల్ రౌండర్ షేన్ వాట్సన్ అభిప్రాయపడ్డాడు.**

**ఈ-కబురు:** రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ఇంకాస్త ముందు వచ్చి ఉంటే... చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధించి ఉండేదని ఆస్ట్రేలియా మాజీ ఆల్ రౌండర్ షేన్ వాట్సన్ అభిప్రాయపడ్డాడు. ధోనీ బ్యాటింగ్‌ను అభిమానులు ఆస్వాదిస్తున్నారని చెప్పాడు. అతడు బ్యాటింగ్ ఆర్డర్‌లో మరింత ముందుగా వచ్చి, మరిన్ని పరుగులు చేయాలని వారు కోరుకుంటున్నారన్నాడు. ధోనీ 43 ఏళ్ల వయసులోనూ వికెట్ కీపింగ్ అద్భుతంగా చేస్తున్నాడని షేన్ వాట్సన్ కొనియాడాడు.

రాహుల్ త్రిపాఠిని ఓపెనర్‌గా పంపడం మంచి నిర్ణయం కాదన్నాడు. రుతురాజ్ గైక్వాడ్ మంచి నైపుణ్యం ఉన్న ఓపెనర్. కానీ అతడేమో తర్వాత బ్యాటింగ్‌కు వచ్చాడని వాట్సన్ అన్నాడు. రుతురాజ్ కూడా హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో కొన్ని షాట్లు మరింత మెరుగ్గా ఆడి ఉండాల్సిందన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ ఇదే బ్యాటింగ్ లైనప్‌ను కొనసాగిస్తే వారు రానున్న మ్యాచుల్లో కూడా ఇబ్బందుల పాలయ్యే ప్రమాదం ఉందని షేన్ వాట్సన్ హెచ్చరించాడు. శుక్రవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు 50 పరుగుల తేడాతో చెన్నైపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు 196 పరుగులు చేసింది. ఛేదనలో చెన్నై 146 పరుగులు మాత్రమే చేయగలిగింది.



**'ధోనీ కేవలం 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు. అతడు బ్యాటింగ్ ఆర్డర్‌లో కాస్త ముందుగా వచ్చి ఉంటే ఇంకా బాగుండేది. నా ఉద్దేశంలో అశ్విన్ కన్నా ముందే క్రీజులోకి వచ్చి ఉండాల్సింది. మరో 15 బంతులు ఇలాగే ఆడి ఉంటే... కచ్చితంగా చెన్నై సూపర్ కింగ్స్ విజేతగా నిలిచి ఉండేది' అని షేన్ వాట్సన్ స్టార్ స్పోర్ట్స్‌తో అన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ టీమ్ కాంబినేషన్ కూడా సరిగా లేదన్నాడు. దీపక్ హుడా తన స్థాయికి తగ్గట్లు రాణించలేకపోయాడని అభిప్రాయపడ్డాడు. అలాగే సామ్ కరన్ అయిదో స్థానంలో కాకుండా ఏడో స్థానంలో బ్యాటింగ్ చేస్తే బాగుంటుందని వాట్సన్ సూచించాడు.**




## సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ..

# ముంబయి లక్ష్యం 197

**ఐపీఎల్ 2025లో భాగంగా గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ తలపడుతున్నాయి.**

**ఈ-కబురు,అహ్మదాబాద్:**

ఐపీఎల్ 2025లో భాగంగా గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ తలపడుతున్నాయి. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (63; 41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. శుభ్‌మన్ గిల్ (38; 27 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), జోస్ బట్లర్ (39; 24 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. కగిసో రబాడ (7), సాయి కిషోర్ (1) నాటౌట్‌గా నిలిచారు. ముంబయి బౌలర్లలో హార్దిక్ పాండ్య 2, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, ముజీబుర్ రెహమాన్, సత్యనారాయణ రాజు తలో వికెట్ పడగొట్టారు.

**ఓపెనర్లు తొలి వికెట్‌కు 51 బంతుల్లో 78 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ట్రెంట్ బౌల్ట్ వేసిన మూడో ఓవర్‌లో రెండు ఫోర్లు బాదిన సుదర్శన్.. ఫోర్, సిక్సర్‌తో ముజీబుర్‌కు స్వాగతం పలికాడు. దీపక్ చాహర్ వేసిన ఆరో ఓవర్‌లో గిల్ ఓ సిక్స్, ఫోర్ బాదాడు. ఈ క్రమంలో హార్దిక్.. గిల్‌ను ఔట్ చేసి ముంబయికి ఉపశమనం అందించాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన బట్లర్.. శాంట్నర్ బౌలింగ్‌లో వరుసగా సిక్స్, ఫోర్ బాదేశాడు. దీంతో స్కోరు 10 ఓవర్లకు 92/1కి చేరింది. నిలకడగా బౌండరీలు బాదుతున్న బట్లర్‌ను ముజీబుర్ వెనక్కి పంపడంతో 51 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే సుదర్శన్ హాఫ్ సెంచరీ (33 బంతుల్లో) అందుకున్నాడు. షారుక్ ఖాన్(9) హార్దిక్ బౌలింగ్‌లో తిలక్ వర్మకు చిక్కాడు. చివరి నాలుగు ఓవర్లలో గుజరాత్ 45 పరుగులు చేసి సుదర్శన్, రూథర్‌ఫోర్డ్ (18), రాహుల్ తెవాతియా (0), రషీద్ ఖాన్ (6)ల వికెట్లను కోల్పోయింది.**